క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో అన్నదానం



వరంగల్: హనుమకొండలోని సహృదయ వృద్ధాశ్రమంలో వరంగల్ వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు తమ హెల్పింగ్ హ్యాండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు క్లబ్ కన్వీనర్ డాక్టర్ హేమశరత్ తెలిపారు. కళాశాల ఏడవ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. ఈమేరకు వారిని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బలరాం, తదితరులు అభినందించారు.

నిరంతర అభ్యాసంతో దివ్యాంగుల్లో మానసిక వికాసం



హన్మకొండ కల్చరల్: నిరంతర అభ్యాసంతో మానసిక దివ్యాంగుల్లో మానసిక వికాసం పెంపొందించవచ్చని భద్రకాళి దేవాలయ ఈఓ శేషుభారతి అన్నారు. ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రకాళి దేవాలయం ప్రాంగణంలో హనుమకొండ మల్లికాంబ మనోవికాస కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శేషుభారతి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం భక్తులకు మల్లికాంబ సిబ్బంది అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేంద్ర నిర్వాహకురాలు బండా రామలీల, కోడం కల్యాణ్, సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

పోషించ లేకుంటే పిల్లలను ప్రభుత్వానికి అప్పగించవచ్చు

న్యూశాయంపేట: పోషించే స్థితి లేనప్పుడు అప్పుడే పుట్టిన శిశువులను తల్లిదండ్రులు ప్రభుత్వానికి అప్పగించవచ్చని వరంగల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్మన్ మండల పరశురాములు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వానికి అప్పగించిన పిల్లలను పిల్లలు లేని దంపతులకు చట్టప్రకారం దత్తత ఇవ్వనున్నట్లు వివరించారు. భ్రూణ హత్యలకు పాల్పడడం, అప్పుడే పుట్టిన పిల్లలను వదిలించుకోవాలని చూడడం శోచనీయమని పేర్కొన్నారు. ఊరుగొండలో జరిగిన ఘటన బాధాకరమని ఆయన తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

హసన్‌పర్తి: నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో ఎన్‌సీసీ సహకారంతో శరత్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ ఏవీవీ.సుధాకర్, డాక్టర్ పీ.మూర్తి, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

వరంగల్ : గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్ పరిధిలోని ఆరెపల్లి శివారులో ఉన్న ప్రతిమ ఆస్పత్రి వెనుక ఆదివారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభించిందని ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పులి రమేష్ తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలం వద్దకు వెళ్లి పరిశీలించగా సుమారు 65–70 సంవత్సరాల వయస్సు గల మహిళ శవం ఉందన్నారు. ఆమె గులాబీరంగు చీర, నీలిరంగు జాకెట్ ధరించి ఉందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఏనుమాముల సీఐ (87126 85120), ఎస్సై (87126 85288)కి సమాచారం అందించాలని కోరారు.

వడదెబ్బతో కార్మికుడి అస్వస్థత

ఖిలా వరంగల్ : పొట్టకూటి కోసం కూలికి వెళ్లిన ఓ వ్యక్తి ఎండవేడితో ఆదివారం మధ్యాహ్నం వాంతులు, విరోచనాలతో ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే 108లో ఎంజీఎంకు తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నరసరావుపేట చెందిన మోతాసు రహీం హుస్సేన్ (55) ఉర్సు గుట్ట ఏరియాలో ఉంటూ వరిధాన్యాన్ని లోడింగ్ హమాలీగా పనిచేసి జీవనం సాగిస్తున్నాడు. రోజు వారిగానే ఆదివారం ఉదయం లోడు కోసం పనికి వచ్చాడు. కరీమాబాద్ ఉర్సు ఏరియాలో ధాన్యం లోడు చేస్తుండగా సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే క్షణాల్లో వాంతులు, విరోచనాలు చేసుకున్నాడు.

చినజీయర్‌కు ఆహ్వానం

వరంగల్: వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'ప్రజ్ఞ' ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని త్రిదండి చినజీయర్ స్వామిని ఆదివారం ఆహ్వానించారు. ఆయనను జాతీయ ప్రైవేట్ స్కూల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జేఎస్.పరంజ్యోతి, టీఆర్ఎస్ఎంఎ రాష్ట్ర ముఖ్య సలహాదారుడు శేఖర్‌రావు, ట్రస్మా వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరి కలిసి ప్రజ్ఞా కార్యక్రమం గురించి చర్చించినట్లు పరంజ్యోతి తెలిపారు.

నగరంలో కలుషిత నీటి సరఫరా

- రంగు మారిన నల్లానీళ్లు
- ఎన్నికల విధుల్లో అధికారులు
- వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



వరంగల్ గిర్మాజీపేటలో రంగుమారిన నల్లా నీరు

వరంగల్ అర్బన్: అసలే మండు వేసవి.. ఎండలు దంచికొడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రత్యేక కార్యాచరణలో తాగునీటిని సరఫరా చేయాలి. గ్రేటర్ వరంగల్ ఇంజినీర్లు తమ బాధ్యతలను గాలికొదిలేశారు. ఎన్నికల విధుల పేరిట ప్రజలకు అందించాల్సిన అత్యవసర సేవల్లోనూ అలక్ష్యం వహిస్తున్నారు. అరకొరగా కలుషిత నీరు సరఫరా కావడంతో జనం అల్లాడిపోతున్నారు. వ్యాధుల భయంతో ఓ మోస్తరు ఆదాయ వర్గాల వారు మినరల్ వాటర్‌పై ఆధారపడుతుంటే.. పేదలు మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో ఆ నీటినే తాగుతున్నారు.

నాలుగు రోజులుగా..

వరంగల్‌లోని చార్‌బౌళి, గిర్మాజీపేట, ఎల్బీనగర్, కాశిబుగ్గ, లేబర్ కాలనీ, చింతల్ యాకుబ్ తదితర ప్రాంతాల్లో దుర్వాసనతో కూడిన రంగు మారిన నీరు సరఫరా అవుతోంది. నాలుగు రోజులుగా ఇలాంటి నల్లా నీరు సరఫరా అవుతుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నల్లాల ద్వారా వచ్చే నీరు పది నిమిషాల వరకు బురద మట్టితో కూడి రంగు మారి వస్తోంది. తరువాత కాస్త మెరుగ్గా వస్తున్నాయి. ఒక్కోసారి దుమ్ము ధూళితో వస్తుండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బల్దియా ఇంజినీర్లు అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల నీరు శుద్ధి చేయడం లేదని, పైపులైన్ల లీకేజీలను అరికట్టడంతో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

'మార్క్స్' ఆశయ సాధనకు పోరాటం



మార్క్స్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



న్యూశాయంపేట: సీపీఐ కార్యాలయంలో..

వరంగల్: కారల్ మార్క్స్ ఆశయాల కోసం పోరాడుదామని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. మార్క్స్ జయంతి సందర్భంగా వరంగల్ శివనగర్‌లో సీపీఐ తమ్మెర భవనంలో సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మార్క్స్ ఆశయ సాధనమైన దోపిడీ రహిత సమాజం కోసం పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, వీరగోని శంకరయ్య, జన్ను రవి, ఎలేందర్, యాకూబ్, యాకాంబ్రచారి, వెంకటాద్రి, పాషా, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

న్యూశాయంపేట: కారల్ మార్క్స్ ఆశయాలను సాధించేవరకూ పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. మార్క్స్ 206వ జయంతి సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లేష్, సారంగపాణి, రాజు, రవి, రాజకుమార్, రమేష్, అనిల్, శివ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో..

హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చుక్కయ్య, సాంబయ్య, రవి, రాజు, భాగ్యలక్ష్మి, రాజేష్, వెంకన్న, చందులాల్, స్వరూప, గొడుగు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పాటుపడే వారినే ఎన్నుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్

హన్మకొండ: వినియోగదారుల సంక్షేమానికి పాడుపడే వ్యక్తికి ఓటు వేసి ఎన్నుకోవాలని కన్స్యూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ అన్నారు. హనుమకొండలోని ఆల్ ఇండియా కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ కార్యాలయంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు త్రిపురోజు రవికుమార్ అధ్యక్షతన ఆల్ ఇండియా కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ రాష్ట్ర ప్రతినిధుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో సుదర్శన్ మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం 1986, 2019ని అనుసరించి తామందరం పొందిన ఆరు హక్కుల్లో 'బాధ్యతాయుతంగా ఎంపిక చేసుకునే హక్కు' ముఖ్యమైనదని వివరించారు. రవికుమార్ మాట్లాడుతూ సభ్యులందరికి ఓటరు చైతన్య కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ప్రతినిధులు నరహరి, కిరణ్ కుమార్, వెంకటేశ్వర్ రావు, వెంకటరమణ, రవి, ప్రకాష్, ప్రవీణ్ కుమార్, సాయినాథ్, రమేష్ బాబు, రజాక్, శ్రీనివాస్ గౌడ్, మహేందర్, మోహన్ రావు పాల్గొన్నారు.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న వాకర్స్

కేయూ క్యాంపస్: రక్తదానం చేయడమంటే మరొకరికి ప్రాణదానం చేసినట్లేనని కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య అన్నారు. కాకతీయ యూనివర్సిటీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని క్రీడా మైదానంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ చీఫ్ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, కేయూ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, వీరస్వామి బాధ్యులు మొగిలయ్య, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు డాక్టర్ కిషన్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న పిల్లలు

హన్మకొండ: యువతను మహోన్నతులుగా తీర్చిదిద్దడమే రామకృష్ణ సేవా సమితి లక్ష్యమని ఆ సమితి హనుమకొండ అధ్యక్షుడు కటంగూరి సత్యనారాయణ రెడ్డి అన్నారు. రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీలో నిర్వహిస్తున్న బాల సంస్కార్ వేసవి శిక్షణ శిబిరంలో ఆయన ఆదివారం పాల్గొని మాట్లాడారు. సమితి నిర్వహిస్తున్న కార్యక్రమాలు తమ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షిస్తాయని అన్నారు. మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ బండారి జగదీష్ మాట్లాడుతూ టీనేజ్ పిల్లల్లో వచ్చే మానసిక, శారీరక మార్పులను తల్లిదండ్రులు గుర్తించి, వారి అభిప్రాయాలను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవాసమితి హనుమకొండ ప్రధాన కార్యదర్శి జినుగు విష్ణువర్ధన్ రెడ్డి, కోశాధికారి కేవీ.రావు, బాల సంస్కార్ కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ రామకృష్ణ, స్వరూప, రాధిక, సేవా సమితి సభ్యులు తిరుపతిరెడ్డి, కేదారి, అశోక్ రెడ్డి, అంజనీదేవి, లక్ష్మీదేవి, పార్వతి, సరోజ, అనిత, శిల్ప, వలంటీర్లు వీణ, విష్ణు, పరశురాములు, శ్రీకర్ పాల్గొన్నారు.

రైల్వే కార్మికులకు ఘన నివాళి



కాజీపేట రూరల్: రైల్వే కార్మికుల మృతికి మౌనం పాటిస్తున్న ఇన్‌స్టిట్యూట్ కమిటీ సభ్యులు



కాజీపేట: నివాళులర్పిస్తున్న నాయకులు

కాజీపేట రూరల్: రైల్వే కార్మికుల మృతికి కాజీపేట రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ కమిటీ కార్యవర్గ సభ్యులు ఆదివారం నివాళి అర్పించారు. రైల్వే ఇన్‌స్టిట్యూట్ సభ్యుడు రిటైర్డ్ సీనియర్ గార్డ్, చెస్ ప్లేయర్ ప్రకాష్, కాజీపేట డీజిల్ లోకోషెడ్‌లో సీనియర్ టెక్నీషియన్ ఎస్.రాంచందర్ రావు అకాల మృతికి రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ రాజయ్య, కోశాధికారి జి.రాజేశ్వర్‌రావు, కార్యవర్గ సభ్యులు రవికిరణ్, ప్రవీణ్, మల్లయ్య, లక్ష్మీనారాయణ, రాంప్రసాద్, రాజలింగం, వెంకటరెడ్డి, వేదప్రకాష్, నాగరాజు, జాఫర్, రవి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడికి..

కాజీపేట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన పారిశుద్ధ్య జవాన్ కొమ్ము దేవయ్య సంస్మరణ సభను రహమత్ నగర్ కాలనీలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, సహకార సంఘం ఉపాధ్యక్షుడు గంగుల శ్రీనివాస్ రెడ్డి, కట్కూరి రమేష్, గంగుల రాజిరెడ్డి, చందన్న, జయంతి, వెంకటమల్లు, రమేష్ పాల్గొన్నారు.

నీటి కష్టాలు తీర్చాలని వినతి

ఖిలా వరంగల్: వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లో తాగునీటి కోసం ప్రజలు అరిగోస పడుతున్నారు. రెండుళ్లుగా కొనసాగుతున్న అండర్ డ్రెయినేజీ నిర్మాణంతో తాగునీటి పైప్‌లైన్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దాంతో పలు కాలనీలకు తాగునీరు సరఫరా కావడం లేదు. ఈక్రమంలో ట్యాంకర్ కోసం ఎదురు చూస్తూ అనేక అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఈమేరకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రవీందర్, బత్తుల సత్యనారాయణ, ఆడెపు భాస్కర్, విజయ్, నాగకిషన్, పుట్ట రవి, వేణుగోపాల్, శ్రీధర్ పాల్గొన్నారు.

రేపు భారత్ బచావో సదస్సు

విద్యారణ్యపురి: భారత్ బచావో హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 7న హనుమకొండలోని డీమార్ట్ ఎదురుగా ఉన్న అసుంత భవన్‌లో నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని భారత్ బచావో హనుమకొండ చైర్మన్ రామబ్రహ్మం, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.వెంగల్‌రెడ్డి, వరంగల్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర బాధ్యులు డాక్టర్ మార్క శంకర్ నారాయణ, డాక్టర్ రాజమహ్మద్ ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. రాజ్యాంగ పరిరక్షణ – ప్రమాదంలో భారత రిపబ్లిక్ పౌరుల పాత్ర అనే అంశంపై ప్రముఖ ఆర్థికవేత్త పరకాల ప్రభాకర్, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలు – వైఫల్యాలు అనే అంశంపై ప్రొఫెసర్ కోదండరామ్ ప్రసంగిస్తారని తెలిపారు.

లూపస్ వ్యాధిపై అవగాహన



హన్మకొండ అర్బన్: నగరంలోని అపెక్స్ ఆస్పత్రిలో ప్రముఖ కీళ్ల వ్యాధి నిపుణులైన డాక్టర్ విఘ్నేష్ ఆధ్వర్యంలో లూపస్ వ్యాధిగ్రస్తులకు ఆదివారం ఉచిత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేష్ మాట్లాడుతూ లూపస్ డే సందర్భంగా ప్రతి సంవత్సరం మే మొదటి ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కీళ్ల నొప్పులు, వాపులు, జుట్టు ఎక్కువగా రాలడం, ముఖం మీద సీతకోక చిలుక ఆకృతిలో ఎర్రటి మచ్చలు, జ్వరం, అలసట లాంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే కీళ్ల వైద్య నిపుణుల (రుమటాలజిస్ట్)ను సంప్రదించాలని సూచించారు. చికిత్స ఆలస్యమైతే ఈ వ్యాధి శరీరంలోని ఇతర అవయవాలకు కూడా వ్యాపించే అవకాశం ఉందన్నారు.

కార్పొరేటర్ రవి విడుదల

ఖిలా వరంగల్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులో పరకాల సబ్ జైలు రిమాండ్ ఖైదీగా ఉన్న 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్లి రవి ఆదివారం విడుదలయ్యారు. ఈమేరకు ఆయనను మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, స్థానికులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో పూజారి విజయ్, వనం కుమార్, అంకం దేవానంద్, పోలెపాక రాజన్‌బాబు, మంద నవీన్, మల్లేశం, సాదుల రంజిత్, బజ్జూరి వాసు, పేర్న రవి, తదితరులు ఉన్నారు.

ముస్లింలను పట్టించుకోని ప్రభుత్వాలు



హన్మకొండ: ముస్లింలను పట్టించుకోని బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ అనుబంధ మైనారిటీ సెల్ నాయకులు పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నయీమొద్దీన్, ఖుద్దూస్, మసూద్, మహమూద్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో మసీదు, ఈద్గాల వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం కనీస ఏర్పాట్లు చేయలేదని, ప్రత్యేక నిధులు కేటాయించలేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రంజాన్, బక్రీద్ సందర్భంగా అన్ని వసతులు ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో ముస్లింలపై దాడులు పెరిగాయని ఆరోపించారు. ఖలీల్, మౌలానా, జెబా, హబీబ్, అఫ్జల్, సలీల్, హజీద్ పాల్గొన్నారు.

10జీపీఏ విద్యార్థులకు అభినందన



ఖిలావరంగల్: రంగశాయిపేటలోని రెనార్డ్స్ హైస్కూల్‌లో ఆదివారం ఇటీవల పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీధర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 45 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా ఇద్దరు 10 జీపీఏ సాధించారన్నారు. మిగతా వారు కూడా 9 జీపీఏ పైబడి సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలోచైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్, ఏజీఎం రాజేశ్వర్‌రెడ్డి, కోఆర్డినేటర్లు శివ, శ్రీహరి, డీన్ వెంకటేష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం



కాశిబుగ్గ: పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోటేశ్వరమ్మ

కాశిబుగ్గ: కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ కోటేశ్వరమ్మ అన్నారు. 35వ డివిజన్‌కు చెందిన సుమారు వంద మంది మహిళలు కాంగ్రెస్‌లో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో రాధ, వనిత, భవాని, జ్యోతి, కొమురమ్మ, గంగమ్మ, లలిత, సుగుణ, యాదమ్మ, రాజేశ్వరి, సమ్మక్క పాల్గొన్నారు.

వరంగల్ చౌరస్తా: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ అన్నారు. వరంగల్ వరంగల్ 27వ డివిజన్‌లోని ఎల్‌బీఆర్ నగర్, కృష్ణాకాలనీ, గోవిందరాజుల గుట్ట ప్రాంతాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుకు ఓటు వేసి కడియం కావ్యను గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో బాషపాక సదానందం, గూడ శారద, గుల్లపల్లి రామకృష్ణ, రంజిత్, సర్దార్ పాల్గొన్నారు.

మోదీ మరోసారి ప్రధాని కావడం ఖాయం



ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ అభినవ్‌భాస్కర్

హన్మకొండ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీతో గెలిచి నరేంద్ర మోదీ మూడవ సారి ప్రధాని కావడం ఖాయమని కార్పొరేటర్ దాస్యం అభినవ్‌భాస్కర్ అన్నారు. ప్రచారంలో భాగంగా నగరంలోని 60వ డివిజన్ వడ్డెపల్లిలోని మిడిదొడ్డి వాడ, కటకం వాడ, కట్కవాడలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ శ్రీరంగం సాగర్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సతీష్, యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

46వ డివిజన్ రాంపూర్‌లో..

మడికొండ: 46వ డివిజన్ రాంపూర్ గ్రామంలో కార్పొరేటర్ మునిగాల సరోజన ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పిట్టల రమేష్, మునిగాల శ్రీకాంత్, సదానందం, కర్ణాకర్, రాజు, రమేష్, సతీష్, వినోద్, కుమార్ పాల్గొన్నారు.

బీజేపీతోనే సమగ్రాభివృద్ధి

ఖిలా వరంగల్: బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపుతోనే నగరంలో సమగ్రాభివృద్ధి జరుగుతుందని బీజేపీ రాష్ట్ర నేత, అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ 41వ డివిజన్ వరంగల్ శంభునిపేటలో బీజేపీ నేత కర్నె రవీందర్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాదాసి రాజు, బైరి మురళీకృష్ణ, కర్నె వాసుదేవ్, తాళ్లపెల్లి అర్జున్, గందె మమత, జనార్దన్, కీర్తి అజేంద్ర, పెండ్యాల రమేష్, శివకృష్ణ, గందె గోపి, మురళీకృష్ణ, మైదం సుదర్శన్, మురళి, బక్కి రంజిత్, కత్తి సోనీ, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి



వినయ్‌భాస్కర్‌తో రిటైర్డ్ ఉద్యోగులు

కాశిబుగ్గ: ఈనెల 13న జరగబోయే ఎంపీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌కు గెలిపించాలని 19వ డివిజన్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు చిలువేరు పవన్ పిలుపునిచ్చారు. 75, 76, 77వ బూత్‌ల్లో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలోనే వరంగల్ అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు. ప్రచారంలో క్యాతం రంజిత్, బానోత్ కిరణ్ నాయక్, చెన్నూరి కిషోర్, కొక్కరకొండ చిరంజీవి, నాసం హరీష్, పాపాయ్య, కిరణ్, బాలు, వరుణ్ పాల్గొన్నారు.

యూనికాన్ ఆర్గాన్ రిటైర్డ్ ఉద్యోగుల మద్దతు

హన్మకొండ: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కాజీపేట మండలం కడిపికొండలోని యూనికాన్ ఆర్గాన్ ప్రైవేట్ లిమిటెడ్ రిటైర్డ్ ఉద్యోగులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈమేరకు హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌ను ఆదివారం కలిశారు. పార్టీ అభ్యర్థి మారపల్లి సుధీర్‌కుమార్ విజయానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు ఈగ మల్లేశం, యూనికాన్ ఆర్గాన్ ప్రైవేట్ లిమిటెడ్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సాధినేని సుధాకర్, ప్రధాన కార్యదర్శి తంగళ్లపల్లి రాంచందర్, వైస్ ప్రెసిడెంట్ నీలం, బాలరాజు, డైరెక్టర్ రామంచ చేరాలు, శ్రీపతి సారయ్య, గట్ల భిక్షపతి, చారి, అడిచెర్ల సదానందం పాల్గొన్నారు.

బీఎల్‌ఎఫ్ బలపర్చిన అభ్యర్థిని గెలిపించండి



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: బీఎల్‌ఎఫ్ బలపర్చిన ఎంసీపీఐ (యూ) వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కొత్తపల్లి సావిత్రి కంప్యూటర్ గుర్తుకు ఓటు వేయాలని పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి కోరారు. ఎన్నికల ప్రచార వాహనాన్ని వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్ వద్ద కుమారస్వామి, బీఎల్‌ఎఫ్ వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ నర్ర ప్రతాప్ జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధిపత్య కులాల యజమాన్యంలోని ఒకే తాను ముక్కలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ జెండాలు వేరైనా ఎజెండా మాత్రం అన్నింటిది ఒకటేనని విమర్శించారు. స్వదేశీ జపం చేసి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వ హయాంలో గతంలో ఎన్నడూలేని విధంగా దేశవ్యాప్తంగా దళితులు, ఆదివాసులు, బీసీలు, మైనార్టీలపై హత్యలు, దాడులు పెరిగాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు మంద రవి, గడ్డం నాగార్జున, సుంచు జగదీశ్వర్, నగేష్, మల్లికార్జున్, పరిమళ గోవర్ధన్ రాజు, నలివేలు రవి, రాయినేని ఐలయ్య, సోమిడి రవి తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఎన్నిక

కాజీపేట: యోగా వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కార్పొరేటర్ ఎలకంటి రాములు పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష, కార్యదర్శులుగా జంగా ఈశ్వర ప్రసాద్, ఎస్.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సంఘం ఉపాధ్యక్షుడిగా కడారి ఉపేంద్ర, సంయుక్త కార్యదర్శిగా బాసాని నర్సింగరావు, కోశాధికారిగా బి.జగదీష్‌తో పాటు కార్యవర్గ సభ్యులు, గౌరవ సలహాదారులను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులతో వాకర్స్ అసోసియేషన్ మాజీ రీజినల్ కౌన్సెలర్ కె.నర్సింహారావు ప్రమాణ స్వీకారం చేయించారు.